టెన్త్ పరీక్షలు ప్రారంభం

మొదటి రోజున 574 మంది విద్యార్థులు పరీక్షకు దూరం

కలెక్టరేట్, మార్చి 18: ఉరుకులు, పరుగులతో పది పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. ముందుగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆలయాలకు వెళ్లి పూజలు చేశాక పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి రోజున తెలుగు పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాల్లో 24,726 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 24,152 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 574 మంది దూరంగా ఉన్నారు. 97.68 శాతం హాజరు నమోదైంది. స్క్వాడ్ సిబ్బంది 49 కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ 10 పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

టెన్షన్‌తోనే..

అమ్మ ఆశీర్వాదం



సాధారణ పరీక్షల గురించి మాత్రమే తెలిసిన ఆ విద్యార్థులు మొదటిసారిగా కీలకమైన టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. దీంతో సహజంగానే తొలిరోజు అందరూ టెన్షన్‌గా.. హడావిడిగా కనిపించారు. కొందరు అమ్మనాన్న తోడుగా పరీక్ష కేంద్రానికి బయలుదేరారు. గుడికి వెళ్లి పూజలు చేశాక కేంద్రానికి వెళ్లారు. పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టిక్కెట్ నంబర్ చూసుకోవడం.. క్యూలో నిల్చోవడం.. పోలీసుల తనిఖీ తదితర ప్రక్రియలన్నీ వారికి కొత్తే. అన్నీ దాటి చివరికి పరీక్ష గదిలోకి చేరాక.. తోటి స్నేహితులను చూశాక హమ్మయ్యా అనుకున్నారు. బెల్ మోగాక పరీక్ష రాయడం ప్రారంభించారు.

- విజయనగరం



కస్పా ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షకు పంపుతున్న పోలీసులు



పైడితల్లిని ప్రార్థిస్తూ..



వడివడిగా వస్తూ..



హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటూ..



పరీక్ష సమయం

హడావిడేది?

- నెమ్మదించిన రాజకీయ పార్టీలు
- పోలింగ్‌కు ఎక్కువ సమయం ఉండడమే కారణం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తరువాత రాజకీయ పార్టీలు సహజంగా దూసుకుపోవాలి. ఇందుకు భిన్నంగా ఒక్క సారిగా రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లాయి. ఇది తాత్కాలికమే అయినా అన్నిపార్టీలూ కాస్త డీలా పడ్డాయి. పోలింగ్ తేదీకి సమయం ఎక్కువ ఉండడమే కారణం. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో సాధారణ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మనది నాలుగో విడతలో ఉన్న కారణంగా నామినేషన్ల ఘట్టానికే ఇంకా 28 రోజులు గడువుంది. పోలింగ్ మే 13న కావడంతో సుమారు 54 రోజుల గడువుంది. కాగా నామినేషన్ల ఘట్టానికి ముందు సీట్లు ప్రకటించాలి. అయితే వైసీపీ పూర్తిగానూ, టీడీపీ పాక్షికంగా తమ అభ్యర్థులను ప్రకటించాయి. సామాజికవర్గ బలాలు, అభ్యర్థుల పరిస్థితి, ప్రజల అంచనాలు తదితర అంశాలను బేరీజు వేసుకుని టీడీపీ తమ అభ్యర్థులను ప్రకటిస్తోంది. దీంతో కొన్ని చోట్ల ఒక నిర్ణయానికి రాటానికి సమయం పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విజయనగరం, నెల్లిమర్ల(జనసేన), రాజాం, బొబ్బిలి, గజపతినగరం అభ్యర్థులను ప్రకటించింది.

ఇంకా చీపురుపల్లి, ఎస్.కోట ప్రకటించాల్సి ఉంది. ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి, గొంప కృష్ణలు టిక్కెట్టుకు పోటీ పడుతున్నారు. అలాగే చీపురుపల్లిలో అభ్యర్థి ఎవరన్నది తెలియటం లేదు. మాజీ మంత్రి, విశాఖ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కేటాయిస్తారన్నట్లు తెలుస్తోంది. మంత్రి బొత్సను ఎదుర్కొనేందుకు గంటాను బరిలో దించుతున్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున ఇక్కడ సీటు ఆశిస్తున్నారు. మరి ఎవరికి కేటాయిస్తారన్నది మంగళవారానికి స్పష్టత రావొచ్చు.

ఇదిలా ఉండగా విజయనగరం పార్లమెంట్ అభ్యర్థి విషయంలో కూడా టీడీపీ ఒక నిర్ణయానికి రాలేదు. ఎంపీ టిక్కెట్టును పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించే పరిస్థితి ఉంది. కొంత మంది పేర్లను బీజేపీ పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. రాజ్యసభ సభ్యు డు జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మిగిలిన పార్టీలు ఇంకా టిక్కెట్లు ప్రకటించే స్థాయికే చేరుకోలేదు. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఇంతవరకు ప్రకటించలేదు. ఈనెల 25 తరువాత ప్రకటించే పరిస్థితి ఉన్నట్లు పార్టీ వర్గాలు చెపుతున్నాయి. బీఎస్పీ, వామపక్షాలు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

ఖర్చూ ఓ కారణం

రాజకీయ పార్టీలు కాస్తా రిలాక్స్ కావడం వెనుక ఆర్థిక పరమైన అంశాలు కూడా ఉన్నాయి. ప్రచార కార్యక్రమాలను ఇప్పటినుంచే చేపడితే వ్యయభారం పెరిగిపోతుందన్న భయం వారిలో నెలకొంది. ప్రచారం ప్రారంభించాలంటే కాస్తా ఖర్చుతో కూడుకున్న పని. వెంటే వచ్చేవారికి బిర్యానీలతో భోజనాలు, మందు, వాహనాలకు డీజిల్, పెట్రోల్, సాయంత్రానికి చేతిలో ఎంతో కొంత ముట్టజెప్పకపోతే మళ్లీ రారు. ఇలా ప్రతి రోజూ ఖర్చులు తడిసిమోపెడు అవుతాయన్న భయం అభ్యర్థుల్లో ఉంది. దీంతో ఒకటి రెండు రోజులైనా రిలాక్స్ అవుదామనుకుంటున్నారు.



బొత్స వారి కుటుంబ పాలన

- గత ఎన్నికల్లో మెజారిటీ నేతలు వారే..
- ఈసారి ఎన్నికల్లో మంత్రి సతీమణి కూడా..
- విశాఖ ఎంపీ వైసీపీ అభ్యర్థిగా ఝాన్సీలక్ష్మి

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)


జిల్లాలో మళ్లీ బొత్స కుటుంబ సభ్యులకే ఎక్కువ వైసీపీ టిక్కెట్లు దక్కాయి. ఈసారి అదనంగా ఆయన సతీమణి ఝాన్సీలక్ష్మి విశాఖ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. చాలా జిల్లాల్లో సిట్టింగులకు సీట్లు దక్కని పరిస్థితి ఉంది. జిల్లానే తీసుకుంటే రాజాం నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే కంబాల జోగులును పాయకరావుపేటకు మార్చారు. బొత్స విషయానికొస్తే ఇప్పుడున్న కుటుంబ, బంధుగణ సీట్లకు ఢోకా లేకపోవటమే కాకుండా ఏకంగా విశాఖ పార్లమెంట్ టిక్కెట్టును కూడా పొందారు. చీపురుపల్లిలో మంత్రి బొత్స, గజపతినగరంలో బొత్స సోదరుడు అప్పలనరసయ్య, నెల్లిమర్లలో బంధువు బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్ ఇలా బొత్స బంధుగణ రాజకీయమే నడుస్తోంది. ఈ ఎన్నికల ద్వారా విశాఖకు కూడా విస్తరించారు. లోక్‌సభ టిక్కెట్టును మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మికి కేటాయిస్తున్నట్లు వైసీపీ అధిష్టానం ఇటీవల ప్రకటించింది.

ఉమ్మడి జిల్లా వీరి కనుసన్నల్లోనే...

ఉమ్మడి జిల్లా రాజకీయాలను ఇప్పటికీ బొత్స బంధువులే శాసిస్తున్నారు. ఇతర చోట్ల ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్న వారిని కూడా డమ్మీలను చేసి తెరవెనుక తమ వర్గాన్ని నడిపిస్తూ తమకు అనుకూలంగా ఎమ్మెల్యేలు, మంత్రులు పనిచేసేలా వ్యూహాత్మక రాజకీయాలు నడుపుతున్నారు. ఎవరైనా వినకుంటే ద్వితీయ శ్రేణి అనుచరులతో అప్పుడప్పుడు చురకలు అంటిస్తూ వాటిని కావాలనే చల్లారుస్తున్నారు. బొత్స కుటుంబం చొరవ తీసుకోకపోతే ఆ నియోజకవర్గంలో కష్టమన్న స్థాయికి పరిస్థితిని తీసుకువస్తున్నారు. ఇటీవల కొన్ని నియోజకవర్గాల్లో జరిగిన రాజకీయ పరిణామాలే ఉదాహరణ. విజయనగరం కావచ్చు.. ఎస్.కోట కావచ్చు ఇటీవల కాలంలో బొత్స అనుచరులుగా ముద్ర పడ్డవారు పార్టీలు మారిన తీరును గమనించాలి. జిల్లా రాజకీయాల్లో ఆరితేరిన మంత్రి బొత్స, జడ్పీ చైర్మన్ లేనిదే కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ, ప్రభుత్వ కార్యక్రమాలు సాగవు. ఆ జాబితాలో బొబ్బిలి, సాలూరు నియోజకవర్గాలు ప్రధానమైనవి.

ఉప ముఖ్యమంత్రులైనా..

ఉప ముఖ్య మంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పాముల పుష్పశ్రీవాణి ఉన్న కాలంలో కూడా బొత్స హవాయే నడిచింది. ప్రొటోకాల్ ప్రకారం ఉప ముఖ్యమంత్రికే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా నామమాత్రంగా నడిచింది. ఆమె జిల్లాలో నేరుగా ఒక్కసారి కూడా అధికార యంత్రాంగంతో సమీక్షలు నిర్వహించిన పరిస్థితి లేనే లేదు. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కూడా అంతే. గిరిజన ప్రాంత ఎమ్మెల్యేగా తనకు మంజూరైన గిరిజన విశ్వవిద్యాలయాన్ని తన జిల్లాలో ఏర్పాటు చేసుకోలేకపోయారు. పాచిపెంటలో ఏర్పాటు చేస్తామని భూ పరిశీలన చేసినా జార విడుచుకున్నారు. దీని వెనుక బొత్స కుటుంబ ప్రాబల్యమే అన్నది బహిరంగ రహస్యం. రాజన్న అడ్డుకోలేకపోయారు. తన నియోజకవర్గంలోని మెంటాడ మండలం(విజయనగరం జిల్లా)లో కొంత భూ భాగంలో గిరిజన విశ్వ విద్యాలయం ఉంటుందని భావిస్తూ సర్దుకుపోయారు. అంటే ఇతర నియోజకవర్గాల్లో నెలకొల్పాల్సిన కీలక విద్యా సంస్థలను కూడా బొత్స తమకు అనుకూల ప్రాంతానికి తెచ్చుకున్న తీరు స్పష్టంగా కన్పిస్తోంది. ఇపుడు విశాఖ రాజకీయాల్లో జోరు పెంచుకునే వ్యూహంలో ఉన్నారు. అందులో భాగంగా ఎంపీ టిక్కెట్ పొందారు.





విశాఖ

స్వేచ్ఛగా ఓటేయండి

- కలెక్టర్ నాగలక్ష్మి సూచన
- లక్షింపేటలో అవగాహన సదస్సు

వంగర/ రేగిడి, మార్చి 18: ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. వివాదాస్పద గ్రామంగా ఉన్న లక్షింపేటను ఆమె సోమవారం సందర్శించారు. ఓటుపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆమె వెంటే ఎస్పీ దీపిక కూడా ఉన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడానికి తగిన వాతావరణం కల్పిస్తామన్నారు. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఓటరు ఎటువంటి భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అందరూ వినియోగించుకో వాలన్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు సెక్టార్‌కు ఒక అధికారిని నియమించామని, పోలీసుల నుంచి కూడా మరో అధికారిని నియమించామని చెప్పారు. ఓటు వేయడంలో తమకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా సెక్టార్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వయో వృద్ధులకు, దివ్యాంగులకు తమ ఇంటి వద్దే ఓటు వేసుకునే అవకాశం ఉందన్నారు. బాలింతలకు అంగన్‌వాడీ సిబ్బందితో క్రష్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ ఓటు వేయడానికి ఏమైనా సమస్యలు అడ్డు వస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇప్పటికే గ్రామంలో 28 మందిని బైండోవర్ చేశామని, నిర్భయంగా ఓటు వేయాలని అన్నారు. సదస్సులో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గ ఆర్వో జోసెఫ్, ఆర్డీవో శాంతి, డీఎస్పీ చక్రవర్తి ఉన్నారు.

కాగితాపల్లిలో కలెక్టర్ తనిఖీ

పోలింగ్‌కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలతో పాటు చుట్టూ రక్షణ చర్యలు పటిష్టంగా ఉండాలని, కాంపౌండ్ లేని చోట్ల తాత్కాలిక చర్యలు చేపట్టాలని సిబ్బందికి కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వంగర నుంచి వస్తూ రేగిడి మండలం కాగితాపల్లిని సోమవారం సందర్శించారు. అక్కడి 120వ బూత్‌ను తనిఖీ చేశారు. ఓటర్ల సంఖ్య, 80ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పోలింగ్ కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్, ర్యాంప్ సౌకర్యం, తాగునీటి వసతి లేకపోవడంపై ఆరా తీశారు. తాత్కాలిక రక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. బూత్ ప్రాంగణంలో నీడ కోసం పోలింగ్ రోజున టెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు.



లక్ష్మింపేటలో పర్యటిస్తున్న అధికారులు

వీటిని తొలగించరేం?

ఎన్నికల షెడ్యూల్ విడుదలై 48 గంటలు దాటినా ప్రవర్తనా నియమావళిని పాటించడం లేదు. అధికారులు కొన్నిచోట్ల కావాలనే విడిచిపెట్టేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయనగరం నుంచి విశాఖ వెళ్లే మార్గంలో మోదవలస కూడలి జాతీయ రహదారి ఫ్లైఓవర్ గోడలకు ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలవి. వాటిపై పెద్దగా ప్రజా ప్రతినిధులు ఫొటోలు కన్పిస్తున్నా పట్టించుకోవడం లేదు. అక్కడికి సమీపంలో కూడలి వద్ద కొండంత సిద్ధం హోర్డింగ్ కూడా ఉంది. ఇప్పటికీ తొలగించలేదు.

- (విజయనగరం-ఆంధ్రజ్యోతి)





ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

● కలెక్టర్ నాగలక్ష్మి ● నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు: ఎస్పీ

విజయనగరం క్రైమ్, మార్చి 18: జిల్లాలో మే 13న జరగనున్న పార్లమెంట్- అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా సాగేలా సహకరించాలని, నిబంధనలను ప్రజలు, రాజకీయ పార్టీలు పాటించాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. కోట జంక్షన్ నుంచి సీఎంఆర్ కూడలి వరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్, రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తున్నాయని, ప్రజలంతా సహకరించాలన్నారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మాపరహీన్, ట్రైనీ కలెక్టర్ సహజిత్ వెంకట త్రివినాగ్, ట్రైనీ ఐపీఎస్ మండ జావలి అల్ఫాన్స్, కమిషనర్ మల్లయ్యనాయుడు, డీఎస్పీ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో ఫ్లాగ్‌మార్చ్, (ఇన్‌సెట్)లో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు ఐదో డివిజన్‌లో అదితి ప్రచారం

విజయనగరం రూరల్: నగరంలోని ఐదో డివిజన్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా విజయనగరం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అదితిగజపతిరాజు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారు. తొలుత ఐదవ డివిజన్‌లోని ఎన్నికల కార్యాలయం ప్రారంభించి, వెంటనే ఐదవ డివిజన్‌లో ఆమె పర్యటించనున్నారు.

జగన్ పాలనకు చరమగీతం పాడాలి

రామభద్రపురం: రాష్ట్రాన్ని గత 5 సంవత్సరాలుగా పరిపాలించిన వైసీపీ దుష్టపరిపాలనకు ప్రజలు చరమగీతం పాడాలని జనసేన రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పాలూరిబాబు కోరారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాష్ట్రం ఎన్నడూలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, ఇటువంటి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలని ఆయన ప్రజలను కోరారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇసుకను అక్రమంగా వైసీపీ నాయకులు అమ్ముకోవడం సిగ్గుచేటన్నారు. జనసేన కార్యకర్తలు, అభిమానులు ఈ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి బేబీనాయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జనసేన మండల నాయకుడు కనకల శ్యామ్ పాల్గొన్నారు.

ఎంపీ సీట్లు కొప్పులవెలమకు కేటాయించాలి

బొబ్బిలి: విజయనగరం, అనకాపల్లి ఎంపీ సీట్లు కొప్పులవెలమలకు టీడీపీ కేటాయించాలని రాష్ట్ర కొప్పులవెలమ సంఘం ఉపాధ్యక్షుడు పోల జగన్ కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొప్పులవెలమల జనాభా అధికంగా ఉందని, ఆ దామాషాలో రాజకీయ ప్రాధాన్యం కొరవడిందన్న ఆవేదన ఆ సామాజిక వర్గంలో నెలకొందన్నారు. చట్టసభల్లో తమ వాణి వినిపించగలిగే అత్యంత సమర్థులైన కొప్పుల వెలమ నాయకులు అనేకమంది ఉన్నారన్నారు. వారిలో ఎంపీకి పోటీ చేసే వ్యక్తులను గుర్తించి పార్టీ టికెట్లు ఇవ్వాలని ఆయన కోరారు.

బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

కలెక్టరేట్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న ప్రతి విద్యార్థి తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని డీఈవో ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై ఆయా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రధాన గేట్లు మూసివేయొద్దు

వంగర: ప్రస్తుతం పది పరీక్షలు జరుగుతున్న మద్దువలస గురుకులంతో పాటు వంగర జెడ్పీలో ప్రధాన గేట్లకు తాళాలు వేయరాదని ఎంఈవో దుర్గారావు సూచించారు. సోమవారం పరీక్ష సమయంలో గురుకులానికి చేరుకున్న ఆయన ప్రధాన గేట్లు మూసి.... సిబ్బంది లోపల ఉండడంతో ఆగ్రహించారు. గేట్లు తెరిచి... ఉన్నతాధికారులు వచ్చినపుడు నేరుగా ప్రవేశం కల్పించాలన్నారు.

మునకలవలసలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

రేగిడి: మునకలవలస గ్రామంలో రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి 7 రోజుల సేవా శిబిరం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.పురుషోత్తమరావు, జీజేసీ ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రన్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు విశ్వనాథం, శ్రీనివాసరావు, కెప్టెన్ ఎస్.వెంకట్రావు, కాశీ శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం తాతనాయుడు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

రామభద్రపురం: మండల పరిధిలోని ఇట్లా మామిడిపల్లి గ్రామంలో సోమవారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సును బొబ్బిలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. టీబీ వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. ప్రపంచ టీబీ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బొబ్బిలి టీబీ యూనిట్ పరిధిలో గ్రామాల్లో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి జాకేరులో ఉత్సవాలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు శ్రీసీతారామాలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, బుద్ధ అప్పలనాయుడు దంపతులు, గ్రామ పెద్దలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు మంగళవారం ప్రత్యేక పూజలు, రాత్రి 8గంటల నుంచి భయటో భజన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, మహిళా కోలాటం, అన్న సమారాధన, ఎడ్లబండ్ల పరుగు పోటీలు ఉంటాయన్నారు.

ప్రచార వాహనాలను అడ్డుకోండి

● మున్సిపల్ కమిషనర్‌కు ఏఐఎస్ఎఫ్ వినతి



కమిషనరుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బొబ్బిలి, మార్చి 18: ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పెద్దఎత్తున ఫ్లెక్సీలు, ప్రచారవాహనాలతో హోరెత్తిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐ ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మికి జిల్లా ఏఐఎస్ఎఫ్ సహాయకార్యదర్శి బి.రవికుమార్ నాయకత్వంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధ నల ప్రకారం జూన్ వరకు ఎటువంటి అడ్మిషన్లు, ప్రచార క్యాంపైన్ నిర్వహించరాదన్నారు. విద్యాసంస్థలు, కోచింగ్ సెంటరు నిర్వాహకులు ఆ నిబంధనలను తోసిరాజని విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసగించే విధంగా ఆకర్షణీయమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో వేలాది రూపా యలను గుంజుకునే ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. అనుమతి లేకుండా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి హరికృష్ణ, పోలరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం.. విజయం సాధిద్దాం

● జిల్లా వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రచారం ● సూపర్ సిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న నాయకులు



డ్వాక్రా సంఘాల సమావేశంలో నినాదాలు చేస్తున్న టీడీపీ మహిళా విభాగం నాయకులు



గాజులరేగ రాళ్లవీధిలో సూపర్‌సిక్స్ హామీలను వివరిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

విజయనగరం రూరల్, మార్చి 18: టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

● బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం

టీడీపీ బ్రాహ్మణ విభాగం ఆధ్వర్యంలో బాబు చెంతకు బ్రాహ్మణాస్త్రం కార్యక్రమం సోమవారం ఫూల్‌బాగ్‌లో జరిగింది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ వైఫల్యాలు, అదే విధంగా బ్రాహ్మణులకు అన్యాయం జరిగిందని, ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో టీ డీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని టీడీపీ బ్రాహ్మణ విభాగం నాయ కులు, బ్రాహ్మణులు ఇంటింటికీ వెళ్లి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ రామయ్యపంతులు, కిల్లాన మహేశ్వరరావు, వేలిచేటి మణికుమారి, బాబు రావుతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● జయహో ఎస్సీ కార్యక్రమం

నగరంలోని గాజులరేగ రాళ్లవీధిలో టీడీపీ నగర ఎస్సీ సెల్ నాయకులు 'జయహో ఎస్సీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకు లు ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అ దితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. ఐదేళ్లలో దళితుల సంక్షేమానికి కృషి జరగలేదని, పైగా దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు.

● 48, 50 డివిజన్లలో డ్వాక్రా సంఘాల సమావేశం

విజయనగరంలోని 48, 50 డివిజన్ల పరిధిలో డ్వాక్రా సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీడీపీ మహిళా విభాగం నాయకులు కంది శమంతక మణి, పత్తిగిల్లి సూర్యకుమారి, అనురాధ బేగం, మాజీ కౌన్సిలర్ ఆల్తి రాధ, రూన్సీ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడిన టీడీపీ మహిళా విభాగం నేతలు కంది శమంతక మణి, అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి మాట్లాడుతూ, డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసింది టీడీపీయేనన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలంతా టీడీపీ కూటమికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

బొండపల్లి: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలో గిట్టుపల్లి, కనిమెరక గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే దుష్ట రాజకీయంతో ప్రజల జీవనోపాధిని దెబ్బతీసిందన్నారు. ప్రతిఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేసి తన గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రయింద్రం, బోడ సింగిపేట సర్పంచ్‌లు ముదునూరి శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్ అల్లు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు పడాల సుజాత, పి.రాజినాయుడు, గొర్లె సత్యవతి, శనపతి శ్రీనివాసరావు, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు పల్లి లింగమూర్తి, గేదెల మహేష్, పల్లి చిరంజీవి, పడాల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..



బొబ్బిలి: పార్టీలో చేరినవారితో బేబీనాయన



దత్తిరాజేరులో పార్టీలోకి చేరినవారు

దత్తిరాజేరు: చినకాద గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ సర్పంచ్ గేదెల అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ గేదెల అరుణ, ఈ.నరసింహరావు, ధూళి నారాయణప్పలనాయుడు, అలజంగి ప్రసాద్, అలజంగి సీతారాం, ఇప్పల సింహాచలం, బైరెడ్డి గణేష్ తదితరులు టీడీపీలో చేరగా, వారిని ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్.. కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం దాసుపేట గ్రామంలో టీడీపీ కార్యకర్తలతో సమావేశమై సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బెజవాడ బంగారునాయుడు, మజ్జి మహేష్, పెద్దింటి జగన్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన 15 ఎస్సీ కుటుంబాల వారు సోమవారం బొబ్బిలి కోటకు వచ్చి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన బోనెల రాము, శివయ్య, సింహాచలం, నేతుల లక్ష్మి, గుజ్జల దుర్గారావు, గొట్టివాడ రమణ, నేతుల అప్పయ్య తదితరులకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగరారావు(బేబీనాయన) పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులిద్దరినీ అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు తామంతా కృషి చేస్తామని తెలిపారు.

'స్పందన' యథావిధిగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఐవీపీ రాజు

విజయనగరం రూ రల్, మార్చి 18: ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన (గ్రీవెన్స్ సెల్) కార్యక్ర మాన్ని యథావిధిగా నిర్వహించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరారు. సోమవారం పార్టీ కార్యాలయం లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ, తమ సమస్యలు తెలుపుకునేందుకు స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశారని, ఎన్నికల కోడ్ కారణంగా రెండు నెలలు ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పు కుంటారని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని గ్రీవెన్స్‌సెల్ నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలు ఎన్నో ఉన్నాయని, టీడీపీ పక్షాన ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్య క్రమంలో ప్రజల తరపున వినతులు సమర్పించామన్నారు. సమావేశంలో టీడీ పీ నాయకులు కనకల మురళీమోహన్, విజ్జపు ప్రసాద్, ముద్దాడ చంద్రశేఖర్, ఆల్తి బంగారుబాబు, మైలిపిల్లి పైడిరాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రాలేదని ప్రశ్నిస్తే దాడులా?



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ, సీఐటీయూ నాయకులు

శృంగవరపుకోట రూరల్, మార్చి 18: మండలంలోని గిరిశిఖర గ్రామ పంచాయతీ పల్లపు దుంగాడ పాఠశాలకు ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడంతో ప్రశ్నించిన గిరిజన సంఘ నేత జరత గౌరీష్‌పై సదరు పాఠశాల హెచ్ఎం, ఆమె భర్త దాడి చేసి గాయపర్చడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సీపీఎం నాయకుడు గాడి అప్పారావు అన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతు విద్యాశాఖాధికారి నరిసింగరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వీరు విలేఖర్లతో మాట్లాడుతూ గడిచిన కొద్దికాలంగా పల్లపు దుంగాడ పాఠశాలకు ఉపాధ్యాయులు వెళ్లకపోవడంపై గౌరీష్ ప్రశ్నిస్తుండడంతో పాటు పత్రికలకు, అధికారులకు ఫిర్యాదు చేస్తున్నాడన్నారు. దీంతో ఈ పాఠశాల హెచ్ఎం, ఆమె భర్త కాపుసోంపురం వద్ద సోమవారం ఉదయం గౌరీష్‌పై దాడికి తెగబడి బెదిరించడం బాధాకరమన్నారు. దాడికి పాల్పడిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలని ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలనీ కోరారు. ఈ విషయంపై పల్లపుదుంగాడ పాఠశాల హెచ్ఎం సత్యవతి వివరణ కోరగా తాము ఎవ్వరిపై దాడి చేయలేదని, పాఠశాలలోనే ఉన్నామని తెలిపారు.

రైతు ఉద్యమంపై నిరంకుశ వైఖరి తగదు



మాట్లాడుతున్న పండా

విజయనగరం దాసన్నపేట, మార్చి 18: కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమంపై అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని వ్యతిరేకించాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పాండా అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులపై అదనపు పని భారాలు మోపి కార్మిక వర్గాన్ని బానిసలుగా చేస్తున్నారన్నారు. పన్నుల భారాలు పెంచుతూ, వేతనాలు పెంచనీయడం లేదని ఆరోపించారు. ఇచ్చిన వాగ్దానం అమలు చేయకపోవడం వల్లే రైతులంతా తిరిగి ఆందోళనకు దిగవలసి వచ్చిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎఫ్‌టీయూ ప్రతినిధులు కిషోర్‌బాబు, బెహరా శంకరరావు, రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి కల్యాణం



పూజలు చేస్తున్న దృశ్యం

లక్కవర పుకోట (కొత్తవలస), మార్చి 18: కొత్తవలసలోని ఆంజనేయపేట వద్ద గల గోవిందమాంబ మహాదేవి సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సోమవారం విశ్వశాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పాల్గుణ మాస శుక్ల నవమిని సంతరించుకుని గోవింద కల్యాణం కనువిందుగా చేశారు. ఉదయం నుంచి వీరబ్రహ్మేంద్రస్వామిని భక్తులు దర్శించుకుని కల్యాణాన్ని తిలకించారు. లాక్కోజు ఓంకార ఆచార్య సిద్ధాంతి నవ దంపతులతో కల్యాణ మహోత్సవం కన్నులవిందుగా జరిపించారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాదన జరిగింది. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించాం



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనారాణి

రామభద్రపురం, మార్చి 18: మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, కటౌట్లు పూర్తిగా తొలగించామని తహసీల్దార్ ఆకుల సులోచ నారాణి తెలిపారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశామని, మండలంలో కోడ్ ఆఫ్ కాండక్టు పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి కే ఆ గ్రామాల్లో ఉన్న వీఆర్వోలకు సూచ నలు, సలహాలు అందించామన్నారు. అలాగే ఇంటిపై కూడా రాజకీయ పార్టీ జెండాలు ఉండకూడదని సూచించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దమ్మిడి తీర్థం



జామి దమ్మిడితీర్థంలో భక్తులు

జామి: జామి ఎల్లారమ్మ జాతరలో భాగంగా శతాబ్దాల కాలంగా మహిళల కోసం నిర్వహిస్తున్న దమ్మిడి తీర్థం విజయవంతంగా కొనసాగింది. సోమవారం మహిళలు వేలాదిగా ఈ తీర్థంలో పాల్గొని గృహోపకరణాలు, ఇతర అలంకరణ సామగ్రి కొనుగోలు చేశారు. జాతర మూడు రోజులలో వీరు బంధువులకు మర్యాదల్లో ఉండిపోవడం వల్ల అమ్మవారి దర్శనం ఉండదు. అందుకే పూర్వకాలంలో పెద్దలు వీరి కోసం మూడో రోజు దమ్మిడి తీర్థం ఏర్పాటు చేశారని గ్రామ పెద్దలు తెలిపారు. అప్పటి నుంచి ఇది కొనసాగుతోందని చెప్పారు.

పోలిపల్లి పైడితల్లి ఘటోత్సవం నేడే

● లక్షకు పైగా భక్తులు వస్తారని అంచనా



పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం



జాతర ప్రాంతం

రాజాం/రూరల్, మార్చి 18: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ సారథ్యంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఈవో బీవీ మాధవరావు, ఎస్.వి.ఆర్ కళాపరిషత్ అధ్యక్షులు సలాది తులసీదాస్ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. మంగళవారం వేకువఝాము నుంచి అర్ధరాత్రి ఘటోత్సవం ముగిసేంత వరకూ లక్షకు పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

● నేడే కీలకం

పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారం కీలకం కానుంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషా, చత్తీస్‌ఘడ్ ప్రాంతాల్లో స్థిరపడిన ఈ ప్రాంతీయులంతా మంగళవారం అమ్మవారిని దర్శించుంటారు. కీలకమైన ఘటోత్సవ కార్యక్రమం మంగళవారం రాత్రి 12.18 గంటలకు జరగనుంది. నేత్రోత్సవం సందర్భంగా ఈనెల 15న కొండంపేటలోని ఘటాలయానికి తీసుకువెళ్లిన అమ్మవారిని తిరిగి మంగళవారం రాత్రి 12.18 గంటలకు రాజాంలోని ప్రధాన ఆలయానికి ఘటాలతో తీసుకు వస్తారు. ఈ ఉత్సవాన్నే ఘటోత్సవం అంటారు. ఘటోత్సవం పూర్తికాగానే జాతర ముగుస్తుంది. ఇదే సమయంలో భారీగా మందుగుండ కాలుస్తారు.

● నేడు ట్రాఫిక్ ఆంక్షలు

మంగళ, బుధవారాల్లో వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించామని సీఐ మోహనరావు తెలిపారు. బొబ్బిలి, తెర్లాం, సాలూరు తదితర ప్రాంతాల నుంచి రాజాం వైపు వచ్చే భారీ వాహనాలు చీకటిపేట జంక్షన్ నుంచి బొమ్మినాయుడు వలస, ఎం.జె.వలస, జి.సి.పల్లి, జెండాలదిబ్బ మీదుగా రాజాం వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే రాజాం నుంచి బొబ్బిలి వైపు వెళ్లే భారీ వాహనాలు ఈ మార్గంలోనే వెళ్లాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు చీకటిపేట జంక్షన్ నుంచి ఇల్లంనాయుడు వలస, మారేడుబాక, కొత్తవలస మీదుగా రాజాం వైపు వెళ్లే వాహనాలు ఇదే మార్గంలో వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. 300 మందితో భారీ బందోబస్తు ఏర్పాటుచేశామని, ప్రత్యేకంగా ఫ్లైయింగ్ స్క్వాడ్‌ను నియమించామని, సిబ్బందిని మఫ్టీలో సైతం ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

● అసౌకర్యం కలగకుండా చర్యలు

జాతరకు వచ్చే భక్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులు ఎండబారిన పడకుండా షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పించాం. క్యూలైన్లలోనే టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశాం.

\- ఈవో మాధవరావు

పోక్సో కేసులో నిందితునికి ఏడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని జామి పోలీస్‌స్టేషన్లో 2023లో నమోదైన పోక్సో కేసులో అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆబోతుల సత్తిబాబుకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3500 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. సత్తిబాబు తమ గ్రామంలో నివాసం ఉంటున్న బాలికపై లైంగిక నేరానికి పాల్పడినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జామి పోలీస్ స్టేషన్లో ఎస్సై వీరబాబు 2023 సెప్టెంబరు 20న కేసు నమోదు చేశారు. ఈ కేసును విజయనగరం డీఎస్పీ ఆర్ గోవిందరావు దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో అభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. సత్తిబాబుపై నేరం రుజువు కావటంతో ప్రత్యేక న్యాయాధికారి నాగమణి నిందితునికి ఏడేళ్ల జైలు, 3500 జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

లక్కవరపుకోట (కొత్తవలస): మండలంలోని నిమ్మలపాలెం దాటాక కంటకాపల్లి రైల్వే స్టేషన్‌కి సమీపంలో పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసు అధికారి ఏఎస్ఐకేఎం.రావు తెలిపారు. సోమవారం స్థానికులు అందించిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని విజయనగరం జీఆర్పీకి అప్పగించామని తెలిపారు. మృతుడు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జాతరలో అల్లరిమూకల కొట్లాట



జాతరలో గొడవ పడుతున్న యువకులు

రాజాం రూరల్: రాజాంలోని పోలిపల్లి పైడితల్లి జాతరలో సోమవారం రాత్రి అల్లరిమూకలు హల్‌చల్ చేశాయి. సుమారు 40 మంది యువకులు ఇష్టారాజ్యంగా కొట్లాటకు దిగారు. వీరిని విడిపించేందుకు కొంతమంది చేసిన ప్రయత్నాలు సైతం విఫలమయ్యాయి. దీంతో జాతరకు హాజరైన వారంతా బయాందోళనకు గురయ్యారు. అమ్మవారి జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 పోలీసు సిబ్బందిని నియమించినట్లు రాజాం టౌన్ సీఐ మోహన్‌రావు ప్రకటించినప్పటికీ వాస్తవానికి అంతమంది సిబ్బంది ఇక్కడ కనిపించలేదు. ఆదివారం రాత్రి సైతం చిన్నచిన్న గలాటాలు చోటు చేసుకున్నాయి. కొట్లాట సమాచారం అందిన వెంటనే పోలీసులు అప్రమత్తయ్యారు. సీసీ కెమెరాలో వివరాలు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం జాతర ముగింపు కావడంతో మరింత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

కుక్క కాటుతో చిన్నారులకు గాయాలు



కుక్క దాడిలో చిన్నారికి గాయమైన దృశ్యం

శృంగవరపుకోట: మండల కేంద్రమైన ఎస్.కోట ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఇద్దరు చిన్నారులను పిచ్చికుక్క గాయపరిచింది. సోమవారం ఉదయం కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఇళ్ల నుంచి పాఠశాలలకు బయలుదేరుతున్న హృషికేష్, నేహ అనే చిన్నారులను కుక్క కరిచింది. దీంతో వారి తల్లిదండ్రులు ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయించారు. ఇదిలా ఉండగా.. రోజూ వందల మంది రోగులకు వైద్యసేవలు అందిస్తున్న సీహెచ్‌సీలో నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడటం ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మానవ హక్కుల న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పిచ్చికుక్క కరచిన చిన్నారులను ఆసుపత్రికి తీసుకెళ్లామని, వైద్యుల సూచన మేరకు గాయాలను కడగాలని కొళాయిల దగ్గరకు వెళితే నీరు రాలేదని తెలిపారు. పొరపాటున అగ్నిప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ఈ విషయమై వైద్యాధికారి నీలను వివరణ కోరగా మోటారు కాలిపోయిందని.. వెంటనే బాగు చేయించి నీటి సరఫరా పునరుద్ధరించామని తెలిపారు.

బరితెగించిన కాంట్రాక్టర్

● నీటి పథకం వద్ద టేకు చెట్లు నరికివేత



నీటి పథకం వద్ద నరికేసిన చెట్లు

శృంగవరపుకోట రూరల్: ముషిడిపల్లి నీటి పథకం నిర్వహణ పనులు చూస్తున్న కాంట్రాక్టర్ బరి తెగించాడు. సోమవారం ఎటువంటి అనుమతులు లేకుండా నీటి పథకం ఆవరణలోని టేకు చెట్లను నరికివేయించాడు. దీనిపై సంబంధిత డీఈ అప్పారావును వివరణ కోరగా... టేకు చెట్ల నరికివేతకు అనుమతి లేదన్నారు. ఇదే విషయం ఎస్.కోట అటవీ శాఖ డీఆర్‌వో రవికుమార్‌కు తెలియజేయగా వెంటనే సిబ్బందిని పంపించారు. చెట్ల కొలతలు తీసుకొని వెళ్లారు. స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడి నుంచి కొన్ని చెట్లు తరలిపోయాయని తెలిపారు. ఈ ప్రాంతం కలప అక్రమ రవాణాకు కేంద్రంగా మారిందని తెలిపారు.

రంజాన్ దీక్షల్లో ముస్లిం చిన్నారులు



రంజాన్ ఉపవాసదీక్షలు విరమిస్తున్న ముస్లిం చిన్నారులు

బొబ్బిలి: స్థానిక జామియా మసీదులో సోమవారం ముస్లిం చిన్నారులు రంజాన్ ఉపవాస దీక్షలు విరమించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దల ఆశీస్సులతో ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

బొబ్బిలి: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం పీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో బొబ్బిలి రూరల్ అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహాలకు ముసుగులు



రాజాం రూరల్, మార్చి 18: పట్టణంలోని రెండు వైఎస్ విగ్రహాలకు అధికారులు సోమవారం ఉదయం ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలు లోకి వచ్చినా వైఎస్ విగ్రహాలకు ముసుగులు వేయడంలో అధికారులు చూసీ చూ డనట్టు వ్యవహరించడాన్ని కోడ్ కూసినా శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. ఈనేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మెయిన్‌రోడ్ లోని విగ్రహంతో పాటు ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఉన్న విగ్రహానికి తెల్లని వస్త్రం కట్టారు. కాగా పట్టణంలోని పలు ప్రాంతాలలో మరిన్ని హోర్డింగులున్నా వాటిని తొలగించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

16 నెలలుగా ఉపాధి పనులు లేవు

● కలెక్టరేట్ వద్ద లక్కిడాం గ్రామస్థుల నిరసన



నిరసన తెలుపుతున్న వేతనదారులు

కలెక్టరేట్: తమ గ్రామంలో 16 నెలలుగా ఉపాధి హామీ పనులు చేపట్టలేదని... నిరుపేద కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతున్నారని గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. 2022 నవంబరు నుంచి ఇప్పటి వరకూ ఉపాధి హామీ పనులు గ్రామంలో చేపట్టకపోవడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 ఆగస్టు నెలలో పని చేసిన క్షేత్ర సహాయకులను విధుల నుంచి తొలగించారని తెలిపారు. అప్పట్లో రెండు వారాల పాటు గ్రామంలో పనులు చేసి... తిరిగి నిలిపివేశారని ఆరోపించారు. ఇప్పటి వరకూ కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించకపోవడంతో పనులు చేయలేదని తెలిపారు. తమ సమస్యను ఎంపీడీవో, ఉపాధి హామీ సిబ్బందికి వివరించినా పరిష్కారం కాలేదన్నారు. గ్రామంలో సుమారు 1200 మంది వరకూ ఉపాధి హామీ కూలీలు ఉన్నారని... వారికి పనులు లేక అవస్థలు పడుతున్నారని లక్కిడాపు బంగారమ్మ, కారు సూరి సింహాచలం తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. పనులు కల్పించాలని కోరారు.

కలెక్టర్‌కు సమస్య చెప్పబోతే..

● అవకాశం ఇవ్వని సిబ్బంది



వినతి ఇచ్చేందుకు వేచి ఉన్న సీతారాంపురం వాసులు

వంగర: తమ గ్రామం మీదుగా కలెక్టర్ వెళుతున్నారని తెలుసుకున్న సీతారాంపురం గ్రామస్థులు కొందరు సోమవారం రోడ్డెక్కారు. కలెక్టర్ తమ గ్రామానికి రాగానే వాహనం ఆపేందుకు ప్రయత్నించారు. వారిని సిబ్బంది అడ్డుకున్నారు. గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించిన సిబ్బంది ఇది ఎన్నికల సమయమని... తరువాత కలెక్టర్‌కు మీ వినతులు అందజేస్తామన్నారు. గ్రామంలో తాగునీరు లేదని... కలెక్టర్‌కు చెప్పుకోనీయరా అంటూ స్థానికులు ప్రశ్నించారు. అనంతరం సీతారాంపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీలు వెనుదిరిగారు.

ఎల్లారమ్మ జాతర పేరుతో దోపిడీ

జామి: గడిచిన ఐదేళ్లుగా ఎల్లారమ్మ జాతర పేరుతో స్థానిక వైసీపీ నాయకులు వివిధ వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేశారని.. ఈ విషయంపై విచారణ చేయించాలని జామి మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు సోమవారం విజయనగరంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దీనిపై దేవదాయ శాఖ విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. వారు దోచుకున్న డబ్బును స్వాధీనం చేసుకుని అమ్మవారి ట్రస్టుకు జమ చేయాలని కోరారు.

భోజన నిర్వాహకురాలి తొలగింపు

జామి: అన్నంరాజుపేట పంచాయతీ సీతానగరం పాఠశాలలో గత 20ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు లక్ష్మితో పాటు మరో ఇద్దరిని హెచ్‌ఎం ఆధ్వర్యంలోని త్రిమెన్ కమిటీ తొలగించింది. సోమవారం వీరికి ఉత్తర్వులు అందించారు. అధికార పార్టీ నేతలు కక్షతో ఇలా చేశారని బాధితురాలు లక్ష్మి వాపోయింది. ఈ విషయమై ఏంఈవో-2 గంగరాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీ సూచన మేరకు చర్యలు తీసుకోవాలని చెప్పామని.. తొలగింపు విషయం తనకు తెలియదన్నారు.

ట్రాక్టర్‌తో గడ్డి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న దృశ్యం

గజపతినగరం: పాతబగ్గాం గ్రామంలో విద్యుత్ వైర్లు తగిలి వరి గడ్డి దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక కేంద్ర అధికారి ప్రసాద్‌రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లోగిస సూర్య నారాయణ తన పొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టరుతో కల్లానికి తీసుకు వస్తుండగా విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో గడ్డి అగ్నికి ఆహుతయ్యింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి, మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. సుమారు రూ.లక్షా 50వేలు ఆస్తి నష్టం సంభవించనున్నట్టు తెలిపారు.

ఏనుగులు హల్‌చల్



ఏనుగుల దాడిలో నుజ్జయిన సైకిల్, చెల్లాచెదురైన కూరగాయలు

కొమరాడ: గారవలస గ్రామానికి చెందిన వెంకటనాయుడు అనే వ్యక్తిపై ఏనుగుల గుంపు దాడి చేసేందుకు ప్రయత్నించింది. వెంకటనాయుడు సోమవారం ఉదయం కూరగాయలు విక్రయించేందుకు సైకిల్‌పై కళ్లికోట వైపు వస్తుండగా ఏనుగుల గుంపు కనిపించింది. ఏనుగులు ఘీంకరిస్తూ ముందుకు రావడంతో వెంకటనాయుడు వెంటనే భయంలో సైకిల్ అక్కడే వదిలేసి, సమీప పొలాల్లోకి పరుగుతీశాడు. ఏనుగులు అక్కడ ఉన్న సైకిల్‌ను తొక్కేయడంతో పాటు కూరగాయలను ఆరగించాయి. ప్రాణాపాయం తప్పినప్పటికీ తన జీవనోపాధి పోయిందని బాధితుడు వాపోతున్నాడు.

గ్రామాల్లో డ్రైడే పాటించాలి



చిన్నారులను పరిశీలిస్తున్న డీఎంవో

సీతానగరం: గ్రామాల్లో డ్రైడే పాటించాలని డీఎంవో టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని వెంకటాపురం, మరిపివలస, సూరంపేట గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సోమవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి, వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, ఎదుగుదల లోపం, రక్తహీనతగల పిల్లల ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపాలని కార్యకర్తలకు సూచించారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

గరుగుబిల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 20న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.సూర్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలన్నారు.

ఇంటి పట్టా ఇవ్వాలి

పాలకొండ: తనకు ఇంటి పట్టా ఇవ్వాలని పాలకొండలోని వీవర్స్‌కాలనీకి చెందిన కనకం రమణ కోరారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా తమకు ఇచ్చిన సంక్షేమ పథకాల జాబితాలో రూ.6 లక్షల విలువ చేసే ఇంటి స్థలాన్ని ఇచ్చినట్టు సచివాలయ సిబ్బంది తమకు కరపత్రాన్ని అందించారని, అయితే తనకు ఎటువంటి ఇంటిస్థలం మంజూరు కాలేదన్నారు. ఈ మేరకు స్థానిక సచివాలయ సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందించారు.

సమస్యలపై వినతిపత్రం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపై ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణికి అంగన్‌వాడీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షురాలు బలగ రధ సోమవారం వినతిపత్రాన్ని అందించారు. తమ సమస్యలను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ ప్రతినిధులు బి.రాజీ విజయ, వరలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మంగమ్మకు సేవారత్న

గరివిడి: కరోనా సమయంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను గరివిడి పీహెచ్‌సీకి చెందిన ఏఎన్‌ఎం మంగమ్మకు విశాఖపట్నంకు చెందిన మదర్ థెరిస్సా సంస్థ సేవారత్న రాష్ట్ర స్థాయి అవార్డును అందజేసింది. సోమవారం గరివిడి పీహెచ్‌సీలో వైద్యాధికారులు దీపిక, రాజీ చేతులమీదుగా మదర్ థెరిస్సా సంస్థ వ్యవస్థాపకుడు కె.కృష్ణమూర్తి ఈ అవార్డును ఆమెకు అందజేశారు. ఈ అవార్డు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ షీల్డ్ అందించారు.

తొలిరోజు ప్రశాంతం

● పదో తరగతి పరీక్షలు ప్రారంభం
● బందోబస్తు ఏర్పాటుచేసిన పోలీసులు
● అరగంట ముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటచేసుకోకుండా పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. విద్యా శాఖాధికారులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. (ఆంధ్రజ్యోతి బృందం)



జామి: ఉన్నత పాఠశాల వద్ద..



బొబ్బిలి: విద్యార్థులను తనిఖీచేస్తున్న దృశ్యం



ఎస్.కోట: బాలికోన్నత పాఠశాల వద్ద..



గజపతినగరం: పరీక్షా కేంద్ర వద్ద హాల్ టికెట్ల నెంబర్లు సరి చూసుకుంటున్న విద్యార్థులు



భోగాపురంలో..



రామభద్రపురం: పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు



వేపాడ: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం

● గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ
● సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం

రాష్ట్రంలోని వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలుకుదామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు తెలిపే నాయకులు పిలుపునిచ్చారు. జిల్లాలోని పలు చోట్ల వారు సోమవారం పర్యటించి, ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు.

చంద్రబాబు సీఎం కావడం అవసరం

పార్వతీపురం రూరల్: రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు అన్నారు. బాలగొడవ, తదితర గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గురజాన చం ద్రమౌళి, పాడాలనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల సమావేశం

కురుపాం: నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ కోరారు. సోమవారం కురుపాం కోటలో నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోగల ఐదు మండల టీడీపీ, జనసేన నాయకుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా పార్టీ గెలుపునకు ఏవిధంగా పనిచేయాలి అనే విషయాలపై చర్చించారు. అలాగే కురుపాంలో టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోగల టీడీపీ, జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

18 ఏళ్లు ఎమ్మెల్యేగా ఏంచేశారో?

సాలూరు రూరల్: సాలూరు ఎమ్మెల్యేగా రాజన్నదొర 18 ఏళ్లగా ఉండి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఉమ్మడి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. తాను నక్కడవలస గ్రామంలో ఇటీవల పర్యటించిన సమయంలో, అక్కడి గిరిజనులు ఎమ్మెల్యే రాజన్నదొర తమను పట్టించుకోవడం లేదని ఏకరువు పెట్టారన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాజన్నదొర శ్రద్ధ చూపలేదని ఆమె ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమిని గెలిపించాలని కోరారు.



కురుపాంలో సమావేశమైన టీడీపీ, జనసేన నాయకులు



పార్వతీపురం రూరల్: సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న దృశ్యం

సామాజిక న్యాయం పేరుతో మోసం

గరుగుబిల్లి: సామాజిక న్యాయం పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీలకు మోసం చేశారని టీడీపీ అరకు బీసీ సెల్ అధ్యక్షుడు బూరాడ రామ్మోహనరావు విమర్శించారు. గరుగుబిల్లిలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీలకు, ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. అసెంబ్లీ సీట్లకు సంబంధించి అధికంగా రెడ్లకే ప్రాధాన్యత ఇచ్చారని ఆరోపించారు. వెనుకబడిన వర్గాలను నమ్మించి నట్టేట ముంచిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో ఓటు హక్కుతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

టీడీపీలో చేరిక

గుమ్మలక్ష్మీపురం: జర్న పంచాయతీ చోరుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సెంబు ఆధ్వర్యంలో సుమారు 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి పార్టీ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయాలి

● గ్రామాల్లో అధికారుల పర్యటన
● నియమావళిపై సిబ్బందితో సమావేశం





కురుపాంలో పర్యటిస్తున్న ఆర్డీవో వెంకటరమణ, గరుగుబిల్లి: నాగూరులో పర్యటిస్తున్న అధికారులు

కురుపాం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలని నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, పాలకొండ ఆర్డీవో ఎ.వెంకటరమణ కోరారు. కురుపాంలో ఆయన సోమవారం పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లను, పోస్టర్లు, కటౌట్లును తొలగించినది లేనిది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బీఎస్ఎస్ సత్యనారాయణ, ఎంపీడీవో అప్పారావు, పంచాయతీ ఈవో కె.చంద్రశేఖర్, సచివాలయం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని అన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, జెండాలు తొలగించాలని ఎంపీడీవో ఎంవీ సుబ్రహ్మణ్యం అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఏ విధమైన పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, జెండాలు ఉండ కూడదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.జయప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు. ● **భోగాపురం:** ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనల ప్రకారం మోడల్ కోడ్ అమలు చేయాల్సిందేనని తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ ఉద్యోగులకు హెచ్చరించారు. స్థానిక సోమవారం ఎంపీడీవో సమావేశ భవనంలో ఆయన మండల శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా రాజకీయ నాయకుల ఫొటోలు, పోస్టర్లు ఉంటే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి.చంద్రకళ, మండల పరిషత్ ఏవో బంగారయ్య, ఏపీవో ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తప్పవని మండల ఎన్నికల అధికారులు పి.సూర్యనారాయణ, కె.జయ హెచ్చరించారు. సోమవారం వారు నాగూరులో పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన రాజకీయ ప్రకటనల హోర్డింగ్‌లు, పోస్టర్లను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ పరిశీలనలో డీటీ పి.సత్యలక్ష్మికుమార్, ఆర్ఐ ఎం.కృష్ణ, ఎస్ఐ వై.అమ్మన్నరావు తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులకు బాధ్యత వహించాలి

పాలకొండ: ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి గ్రూపుల్లో ప్రతి పోస్టుకు బాధ్యత తీసుకోవాలన్నారు. వివాదాస్పద పోస్టింగ్‌కు సంబంధించి అడ్మిన్ ఏ చర్యలు తీసుకోకుంటే అతడిపై చర్యలు తీసుకుంటామన్నారు. అడ్మిన్ వివాదాస్పద పోస్టు చేస్తే ఐటీ చట్టం ఐపీసీ 153ఏ కింద శిక్ష విధిస్తారని చెప్పారు. మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. గ్రూప్‌ల్లో విద్వేషాలు రెచ్చగొట్టేవి, తప్పుడు సమాచారం, తెలియని సమాచారం, వర్గపోరుకు దారి తీసేవి, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, తప్పుదారి పట్టించే సమాచారం ఉంటే చర్యలు తప్పవన్నారు.

నిబంధనలేవీ?



మెడికల్ షాపుపై తొలగించని ఆరోగ్యశ్రీ బోర్డు

గజపతినగరం: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఎన్నికల కమిషన్ కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలకు చెంది పోస్టర్లు, హోర్డింగ్‌లు, జెండాలు, కరపత్రాలు తదితర వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా రెండు రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.

రంగులు యథాతథం

గరుగుబిల్లి: ఎన్నికల కోడ్ ప్రకటించిన నేపథ్యంలో ఎండీయూ వాహనాలపై జగన్ ఫొటోలు ఉన్న ప్రాంతంలో పేపర్లను అతికించారు. కానీ వాహనాలపై ఉన్న వైసీపీ రంగులు మాత్రం అలాగే ఉన్నాయి.

ఘనంగా కోటదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కళశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మక్కువ: మక్కువలో శ్రీకోటదుర్గమ్మ అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన శోభా యాత్రలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని, కళశాలతో ఊరేగింపుగా వెళ్లారు. ఈ ఊరేగింపులో కోలాటాలు, డప్పు వాయిద్యాలు ప్రదర్శించారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలోగల 250 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీసీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాదు తెలిపారు.

నేటి నుంచి బత్తిలి సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు



సంతోషిమాత

భామిని: బత్తిలి గ్రామంలోని శ్రీసంతోషమాత ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నుంచి నిర్వహించున్నారు. ఈ ఉత్సవాలకు ఆంధ్రాతో పాటు ఒడిశా నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.

ముత్యాలమ్మ విగ్రహ తిరు వీధి



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్: సాలూరు గ్రామదేవతల్లో ఒకరైన ముత్యాలమ్మతల్లి నూతన విగ్రమ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం విగ్రహానికి తిరువీధి నిర్వహించారు. మహిళలు పాల్గొన్నారు. ఈనెల 20న విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ఏపీ ఫైబర్‌నెట్‌లో బొమ్మ మారింది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సాలూరు రూరల్: ఏపీ ఫైబర్‌నెట్‌లో స్వాగత చిత్రాలను మేనేజ్‌మెంట్ సోమవారం మార్పు చేసింది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 24 గంటలు గడిచినా ఏపీ ఫైబర్‌నెట్‌లో సీఎం జగన్, పరిశ్రమల శాఖామంత్రి అమర్‌నాథ్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డిల చిత్రాలను స్వాగత చిత్రాలుగా ప్రదర్శించారు. అలాగే మొదటి చానల్‌లో వైసీపీ కార్యక్రమాలపై ప్రచారం చేశారు. దీనిపై 'కోడ్ మీకే మాకు కాదు' అనే శీరికతో ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో కథనం ప్రచురించిన విషయం విదితమే. దీనిపై ఏపీ ఫైబర్‌నెట్ మేనేజ్‌మెంట్ స్పందించి, ఆ చిత్రాలను తొలగించింది. అలాగే చానల్ 1లో సీఎం జగన్ కార్యక్రమాలను తొలగించి, వేరే చానల్‌ను ప్రచారం చేస్తున్నారు.

విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చూడండి

● ఐటీడీఏ ఏపీవో మురళి

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం వైటీసీని పార్వతీపురం ఐటీడీఏ ఏపీవో మురళి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా కంప్యూటర్ శిక్షణను పరిశీలించి, విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ పార్టీల ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగింపును పరిశీలించారు. ఆయన వెంట వైటీసీ మేనేజర్ రాము, వార్డెన్ శ్రావణి ఉన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న బొత్స కుటుంబం

చీపురుపల్లి: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన సతీమణి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, కుమారుడు సందీప్, పూజిత.. అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, ఈవో జి.శ్రీనివాస్ మంత్రి కుటుంబానికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. అర్చకులు ఆశీస్సులు అందజేశారు. మంత్రి వెంట ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

భోగాపురం: గూడెపువలసలో కె.రామునాయుడు అనే వ్యక్తి తన ఇంటి ఆవరణలో మద్యం అమ్మకాలు చేస్తుండగా పట్టుకుని, కేసు నమోదు చేశామని సీఐ ఎ.రవికుమార్ సోమవారం తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఇంటి ఆవరణలో అమ్మకాలు చేయడంతో అతని వద్ద నుంచి మొత్తం 102 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం ఎక్సైజ్ కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.